నమస్తే తెలంగాణ
# హనుమకొండ
5 | మంగళవారం 16 జూలై 2024 | HANUMAKONDA






# సాగు చేసే వారికే భరోసా ఇవ్వాలి

సమావేశంలో పాల్గొన్న రైతులు

- యువ రైతులను ప్రోత్సహించాలి
- ధాన్యానికి బోనస్ చెల్లించాలి
- ఎరువులు, విత్తనాలపై సబ్సిడీ ఇవ్వాలి
- వ్యవసాయ పరికరాలు పంపిణీ చేయాలి
- బాయిలకాడికి సీసీ రోడ్లు వేయాలి
- పలువురు రైతుల అభిప్రాయం

హనుమకొండ, జూలై 15 : 'సాగు చేసే ప్రతి రైతుకూ రైతు భరోసా ఇవ్వాలి.. పండించిన ధాన్యానికి బోనస్ ఇవ్వాలి.. కౌలు రైతులకు కూడా పథకం వర్తింపజేయాలి.. పండ్లు, కూరగాయ తోటలను ప్రోత్సహించాలి.. ఎరువులు, కూరగాయల విత్తనాలపై సబ్సిడీపై అందించాలి.. యువ రైతులను ప్రోత్సహించాలి.. పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలి.. కష్టపడుతున్న రైతుకు చిన్న పెట్టుబడి కోసం ఇచ్చేదే రైతుభరోసా.. రైతులకు పింఛన్లు ఇవ్వాలి.. బాయిలకాడికి వెళ్లేందుకు సీసీ రోడ్లు వేయాలి' అని ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలువురు రైతులు అభిప్రాయపడ్డారు. సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లో రైతు భరోసా పథకం అమలుపై ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులు, రైతు సంఘం నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఎకరం నుంచి 10 ఎకరాలు ఉన్న వారికి ఇవ్వాలని ఎక్కువ మంది, అందరికీ ఇవ్వాలని కొందరు, కౌలు రైతులకు కూడా పథకం అమలు చేయాలని మరికొందరు కోరారు. అలాగే ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని సూచించారు. కొంత మంది రైతులు తమకు కూడా మాట్లాడే అవకాశం కల్పించాలని, ఎంపిక చేసిన వారినే సమావేశానికి పిలిస్తే బాగుండేదని అసహనం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని సూచించారు.

### రైతులను రైతులుగానే చూడాలి



రైతులను రైతులుగా మాత్రమే చూడాలి. మా తాతలు, తండ్రులు వ్యవసాయం చేసేవారు. వ్యవసాయంపై ఉన్న మక్కువతో నేను డాక్టర్‌ను అయినప్పటికీ వ్యవసాయం చేస్తున్నాను. సాగు చేసే ప్రతి రైతుకూ తేడాలు లేకుండా రైతు భరోసా అమలు చేయాలి. పండ్లతోటలను ప్రోత్సహించాలి. కొత్త పంటలకు భరోసా ఇవ్వాలి. సబ్సిడీ విధానం సైతం అమలు చేయాలి.

**–డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి, నెఫ్రాలజిస్టు, హనుమకొండ**

### 10 ఎకరాల వరకు భరోసా ఇవ్వాలి



ఎకరం నుంచి మొదలుకొని 10 ఎకరాలున్న రైతులందరికీ రైతు భరోసా పథకం వర్తింపజేయాలి. అలాగే కౌలు రైతులను గుర్తించేందుకు గ్రామ స్థాయిలో రైతులు సభ్యులుగా కమిటీలు ఏర్పాటు చేయాలి. సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందజేయాలి.

**–చిర్ర కుమారస్వామి, దీక్షకుంట, నెక్కొండ మండలం**

### రికార్డులు వేర్వేరుగా ఉంటున్నాయి



రెవెన్యూ, వ్యవసాయ శాఖల వద్ద ఉన్న వివరాల్లో వ్యత్యాసం ఉంటున్నది. ఇరు శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ముందుగా రికార్డులు సరిచేయాలి. ఐదు నుంచి 10 ఎకరాల వరకు సాగు చేస్తున్న ప్రతి రైతుకూ రైతు భరోసా అమలు చేయాలి. ఐటీ కట్టే చిరు ఉద్యోగులకు సైతం పథకం వర్తింపజేస్తే బాగుంటుంది.

**– మాదిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ**

### యువ రైతులను ప్రోత్సహించాలి



వ్యవసాయం బతికి ఉండాలంటే యువ రైతులను ప్రభుత్వాలు ప్రోత్సహించాలి. ఐదెకరాల నుంచి 10 ఎకరాల వరకు రైతులకు పథకం అమలు చేయవచ్చు. టాక్స్ పేయర్స్‌కు సైతం రైతు భరోసా అమలు చేయాలి. అలాగే రైతులకు ఎరువులు, విత్తనాలతో పాటు వ్యవసాయ యంత్ర పరికరాలను సబ్సిడీపై అందించాలి.

**– సందీప్‌కుమార్, బచ్చన్నపేట, జనగామ**




సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పక్కన మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, ధనసరి సీతక్క, ఎంపీ కడియం కావ్య, వరంగల్, హనుమకొండ కలెక్టర్లు సత్యశారద, ప్రావీణ్య

# ప్రజాభిప్రాయమే సర్కారు జీవో

## వ్యవసాయాన్ని ఆదుకొనేలా రైతుభరోసా

- రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- సాగు చేసేవారికే భరోసా ఇవ్వాలి
- అభిప్రాయం వ్యక్తం చేసిన రైతులు

హనుమకొండ, జూలై 15 : ప్రజాభిప్రాయం మేరకే రైతుభరోసా పథకం అమలు చేస్తామని వారి నిర్ణయమే సర్కారు జీవోగా రాబోతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క తెలిపారు. వ్యవసాయాన్ని ఆదుకొనేలా పథకాన్ని అమలు చేస్తామని చెప్పారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం రైతుభరోసాపై వరంగల్ కలెక్టర్ సత్యశారద అధ్యక్షతన ఉమ్మడి జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఉప ముఖ్యమంత్రి, మంత్రి వర్గ ఉప సంఘం చైర్మన్ మల్లు భట్టివిక్రమార్క, సభ్యులుగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ప్రభుత్వ విప్ జాటోత్ రామచంద్రూనాయక్‌లు పాల్గొన్నారు. అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రజాభిప్రాయం మేరకే సర్కారు జీవో జారీ చేయనున్నదని పేర్కొన్నారు. క్యాబినెట్ సబ్ కమిటీ రైతుల అభిప్రాయాలను రాష్ట్రవ్యాప్తంగా తీసుకుంటుందని, ఆమేరకు శాసన సభలో అన్ని రాజకీయ పార్టీల సమక్షంలో చర్చించి రైతు భరోసాపై తీర్మానం చేయనున్నట్లు చెప్పారు. పంట సాయం కోసం ప్రభుత్వం అందించే ఒక్క పైసా కూడా దుర్వినియోగం కాకూడదనే రైతులు, రైతు సంఘాలు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా నిర్వహిస్తున్న సమావేశాల్లో సేకరిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు కట్టే పన్నులతో ప్రజల సంక్షేమం కోసం పథకాలను అందిస్తున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కృషిచేస్తున్నామని తెలిపారు. సమావేశాల్లో ప్రతి రైతు చెప్పిన విషయాన్ని పరిగణనలోకి తీసుకొని వాటిపై చర్చించనున్నట్లు తెలిపారు.

### ప్రజాభిప్రాయంతోనే న్యాయం..

– మంత్రి కొండా సురేఖ

ప్రజాభిప్రాయ సేకరణతోనే రైతులకు న్యాయం జరుగుతుందని మంత్రి కొండా సురేఖ అన్నారు. అర్హులైన రైతులకు రైతుభరోసా ఇవ్వాలనేది సర్కారు సంకల్పమన్నారు. రైతు బాగుంటేనే ప్రభుత్వం బాగుంటుందన్నారు. పంటలకు బీమా ఎలా చేస్తున్నామో అదేవిధంగా పశువులకు కూడా బీమాను వర్తింపజేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. గతంలో ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి హయాంలో రైతులకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారని, ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి రైతులకు మేలు చేసేందుకు రైతు భరోసా పథకాన్ని తీసుకొస్తారని, ప్రజలు హర్షించే విధంగా రైతు భరోసా ఉండబోతుందని మంత్రి తెలిపారు. సమావేశంలో ఎంపీలు పోరిక బలరాం నాయక్, డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కడియం శ్రీహరి, దొంతి మాధవరెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, కేఆర్ నాగరాజు, యశస్వినీరెడ్డి, డాక్టర్ మురళీనాయక్, రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర ఆయిల్ సీడ్స్ అండ్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద, రిజ్వాన్ బాషా షేక్, అద్వైత్‌కుమార్ సింగ్, రాహుల్ శర్మ, దివాకర, ఉమ్మడి జిల్లా రైతులు రైతు సంఘాల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

### అవకతవకలు ఉండొద్దనే..

– మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

రైతు భరోసా విషయంలో అవకతవకలు జరగకూడదనే ఉద్దేశంతో రైతుల అభిప్రాయాలను తీసుకొనేందుకు సమావేశాలను నిర్వహిస్తున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. సోనియా గాంధీ, రాహుల్‌గాంధీల సూచనల మేరకు వ్యవసాయరంగానికి పెద్దపీట వేసేందుకు ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. ఇచ్చిన హామీ మేరకు ఆగస్టులో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని. ఇందుకోసం విధివిధానాల రూపకల్పన జరుగుతున్నదన్నారు. రైతుల ఖాతాల్లో రూ. 7,562 కోట్లు ప్రభుత్వం జమ చేసిందన్నారు.

### రైతుల విషయంలో వెనుకడుగు వేయం

– ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ఇన్‌కం టాక్స్, పాన్ కార్డ్ ఉన్న రైతులకు రైతు భరోసా ఇవ్వరని చేస్తున్న దుష్ప్రచారం నిజం కాదని అన్నారు. రైతులకు సంక్షేమం విషయంలో తమ ప్రభుత్వం వెనకడుగు వేయదని, రైతుల నిర్ణయాలే ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలుగా పరిగణిస్తామన్నారు. పేదోడి రాజ్యం రావాలని, మంచి ప్రభుత్వం కావాలని రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకొని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించారని అన్నారు. రైతును రాజు చేసే కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు.

### అసలైన రైతులకే భరోసా

– మంత్రి సీతక్క

అసలైన రైతులకే రైతు భరోసా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి సీతక్క అన్నారు. గత ప్రభుత్వం రైతుబంధు పేరుతో అందించిన పథకంలో లోపాలు ఉన్నాయన్నారు. పేరుకే పెట్టుబడి పథకం అయినా నిజమైన రైతులకు అందలేదన్నారు. రైతుభరోసా విషయంలో రైతుల అభిప్రాయం అనేది ఎంతో ముఖ్యమని అందుకే జిల్లాల వారీగా ఇలాంటి అభిప్రాయాలను తీసుకొని ఒక మంచి పాలసీ తీసుకురానున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవంగా సాగుచేసే రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. పేద రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు.

# దంచికొట్టిన వాన

## వరంగల్ నగరంతో పాటు టేకుమట్ల, కాటారం మండలాల్లో కుండపోత

- ఉప్పొంగిన వాగులు.. నీట మునిగిన పంట పొలాలు.. తెగిపోయిన తాత్కాలిక రోడ్లు
- జలమయమైన రహదారులు, లోతట్టు ప్రాంతాలు

వరంగల్, టేకుమట్ల, కాటారం, పరకాల, జూలై 15 : వరంగల్ నగరంతో పాటు జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల, కాటారం మండలాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. హనుమకొండలో సాయంత్రం కురిసిన కుండపోత వానకు రోడ్లన్నీ చెరువులు, కుంటలను తలపించాయి. బాలసముద్రం, కాకాజీకాలనీ, బస్టాండ్, కాకతీయ డిగ్రీ కళాశాల, అంబేద్కర్ భవన్, పెట్రోల్ పంప్ తదితర ప్రాంతాల్లో రోడ్లపైకి నీరు చేరి జనం ఇబ్బందిపడ్డారు. అలాగే నడికూడ మండలం కంఠాత్మకూర్ గ్రామ శివారులోని కంఠాత్మకూర్ వాగుపై ఉన్న తాత్కాలిక రోడ్డు ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి తెగింది. దీంతో అంబాల మీదుగా హనుమకొండకు రాకపోకలు నిలిచిపోయాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలో భారీవర్షం కురవడంతో చలివాగు, మానేరు వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. వరద ఉధృతికి వాగుల్లో పోసిన తాత్కాలిక మట్టి రోడ్లు కొట్టుకుపోయాయి. టేకుమట్ల–రాఘవరెడ్డిపేట, బూర్నపల్లి–కిష్టంపేట, గర్మిళ్లపల్లి–ఓడేడు గ్రామాల మధ్య తాత్కాలికంగా పోసిన మట్టి రోడ్లు కొట్టుకుపోయాయి. దీంతో జమ్మికుంట, హుజూరాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, మంథని, గోదావరిఖని, మంచిర్యాల, మందమర్రి తదితర పట్టణాలతో టేకుమట్ల మండలానికి సంబంధాలు తెగిపోయాయి. కాటారంలో భారీ వర్షం కురిసింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారు జాము వరకు ఏకధాటిగా కురవడంతో లోతట్టు ప్రాంతాలన్ని జలమయమయ్యాయి. మండలంలో 101.6 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలంలోని శంకరంపల్లి జీపీ పరిధిలోని గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ నీరుచేరింది. బుడగ జంగాల కాలనీలో రేవెళ్లి సమ్మయ్య, గంధం రమేశ్ ఇండ్లలోకి నీరు చేరగా, టేకు రమేశ్ ఇంటి గోడ కూలిపోయింది. రేగులగూడెం జీపీ పరిధి గోపాల్‌పూర్ వద్ద వాగు పొంగి పొర్లడంతో పక్కనే ఉన్న పంట పొలాలు నీట మునిగిపోయాయి. జాదరావుపేట శివారులోని బ్రిడ్జి సమీపంలో వరద తాకిడికి రోడ్డు కోతకు గురైంది. గంగారం అలుగువాగు, పోతుల్వాయి బొర్రవాగు, ఒడిపిలవంచ బండల వాగు, మల్లారం అలుగువాగు పొంగి పొర్లడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దామెరకుంట, మల్లారం, గంగపురి, గుండ్రాత్‌పల్లిలో పెద్దవాగు ఉప్పొంగడంతో పత్తి చేనుల్లోకి వర్షపు నీరు చేరడంతో తీవ్ర నష్టం వాటిల్లింది.



హనుమకొండ బస్‌స్టేషన్ కేడీసీ రోడ్డు మార్గంలో వరదనీటిలో వెళ్తున్న విద్యార్థులు



కాటారం : పోతుల్వాయి వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న బొర్రవాగు



ఎస్సీ హాస్టల్‌లో కొడుకును చేర్పించడానికి ట్రంక్ పెట్టెతో వస్తున్న తల్లిదండ్రులు



బూర్నపల్లి– కిష్టంపేట మధ్య తెగిపోయిన మట్టి రోడ్డు



పబ్లిక్ గార్డెన్ వద్ద వరద నీరు



కాటారం : గోపాల్‌పూర్‌లో వాగు నీటిలో మునిగిన పంట పొలాలు



హనుమకొండ బస్‌స్టేషన్‌లో వర్షపు నీరు

# అనారోగ్యమా.. నిర్లక్ష్యమా?

- అస్వస్థతతో పదేళ్ల బాలుడి మృతి
- వారం క్రితం గురుకులం నుంచి ఇంటికి
- యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వికటించడం వల్లేనని ప్రచారం
- నెక్కొండ మండలం ముదిగొండలో విషాదం
- చిన్నారి చావుపై భిన్న వాదనలు



మణిప్రదీప్ (ఫైల్)



రోదిస్తున్న కుటుంబసభ్యులు

నెక్కొండ, జూలై 15 : వారం క్రితం గురుకులం నుంచి ఇంటికొచ్చిన బాలుడు అంతలోనే అనూహ్య రీతిలో మృత్యువాతపడడం తల్లిదండ్రులకు తీరని శోకం మిగిల్చింది. జ్వరంతో బాధపడుతూ అనారోగ్యంతో చనిపోయాడని ఒకలా, ఆర్‌ఎంపీ వేసిన యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వల్లే వైద్యం వికటించి మృత్యువాతపడ్డాడని ప్రచారం జరుగడం అనుమానాలకు తావిస్తోంది. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం ముదిగొండలో బాలుడు మణిప్రదీప్(10) మృతి ఘటనపై తెలంగాణ వైద్య మండలి(టీజీఎంసీ) స్పందించి సామాజిక మాధ్యమాల్లో వచ్చిన సమాచారం ఆధారంగా సుమోటోగా స్వీకరించి వరంగల్ జిల్లా యాంటీ క్వాకరి బృందాన్ని విచారణ జరుపాలని ఆదేశించింది. స్థానికులు, తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. హసన్‌పర్తిలోని మహాత్మజ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయంలో ఐదో తరగతి చదువుతున్న మణిప్రదీప్ వారం క్రితం ముదిగొండలోని తన ఇంటికి వచ్చాడు. నాలుగైదు రోజులుగా జ్వరం వస్తోందని, ఉదయం శరీరంపై దద్దులు వచ్చాయని, మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తీసుకువెళ్లామని తల్లిదండ్రులు చెప్పారు. అయితే చికిత్స అందించే లోపే కన్నుమూశాడంటూ తల్లిదండ్రులు కోటేశ్వర్–సరిత బోరున విలపించారు. కళ్లెదుట తిరిగిన బాలుడు అకస్మాత్తుగా మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

**ఆర్‌ఎంపీ వైద్యం వికటించడం వల్లే..**

ఆర్‌ఎంపీ వైద్యం వికటించి బాలుడు మృతిచెందినట్లు అటు సామాజిక మాధ్యమాల్లో, గ్రామంలో చర్చ జరుగుతోంది. వారం క్రితం మణిప్రదీప్‌ను కుక్క కరవడంతో ఎంజీఎంలో వ్యాక్సిన్ ఇప్పించారని, సోమవారం ఇచ్చే డోసును స్థానిక ఆర్‌ఎంపీతో వేయించాల్సి ఉంది. అయితే వాక్సిన్ ఇచ్చిన కొద్దిసేపటికే బాలుడు అస్వస్థతకు గురయ్యాడని, మెరుగైన చికిత్స కోసం ఎంజీఎంకు తీసుకెళ్లగా అప్పటికే చనిపోయినట్లు ఎంజీఎం వైద్యులు ధ్రువీకరించినట్లు సమాచారం.

**విచారణకు టీజీఎంసీ ఆదేశం**

మణిప్రదీప్ మృతి ఘటనపై తెలంగాణ వైద్య మండలి స్పందించింది. వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చిన సమాచారం మేరకు సుమోటోగా ఈ కేసును స్వీకరించి వరంగల్ జిల్లా యాంటీ క్వాకరి బృందాన్ని విచారణ జరపాలని ఆదేశిస్తూ మండలి చైర్మన్ డాక్టర్ మహేశ్‌కుమార్, రిజిస్ట్రార్ దండెం లాలయ్య కుమార్ ఆదేశాలు జారీచేశారు. ఆరుగురు సభ్యులతో కూడిన వైద్య బృందం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి విచారణ చేయనున్నది. ఆర్‌ఎంపీ అశోక్ చికిత్స అందించిన క్లినిక్ స్థలాన్ని తనిఖీ చేసి నివేదికను అందించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. టీజీఎంసీ సభ్యులు డాక్టర్ ఎంశేషుమాదవ్, టీజీఎంసీ పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ వి.నరేశ్‌కుమార్, ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు అన్వర్‌మియా, హెచ్‌ఆర్‌డీఏ అధ్యక్షులు పులిపాక వెంకటస్వామి, తానా రాష్ట్ర మాజీ అధ్యక్షులు రాకేశ్ నేతృత్వంలోని వైద్య బృందం విచారణ జరుపనున్నది. వారు అందించే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలుంటాయని రిజిస్ట్రార్ డాక్టర్ దండెం లాలయ్యకుమార్ జారీ చేసిన ఉత్వర్వుల్లో తెలిపారు.